సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 24 । జూలై । 2024



...పనులపై కలెక్టర్ ఆగ్రహం

గాదిగూడ మండలం పర్సువాడ (కే) ఎంపీపీఎస్‌లో అమ్మ అదర్శ కమిటీ చేపట్టిన పనులను కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు.

IIలో▸

ఇద్దరు ఏఎంవీఐల బదిలీ

ఆదిలాబాద్‌టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు మహేశ్, సురేశ్ కామారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏఎంవీఐగా పనిచేస్తున్న మోహన్ గౌడ్ భోరజ్ చెక్‌పోస్టుకు బదిలీపై వచ్చినట్లు జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచించారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ.. నాటిన మొక్కలు సంరక్షించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, అడిషనల్ డీఎంహెచ్‌వో గజానంద్, మలేరియా నివారణ అధికారి శ్రీధర్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9866565156 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'రైతులను ఇబ్బంది పెట్టొద్దు'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. రైతులు రుణమాఫీ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటుంటే కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నాయకులు రోకండ్ల రమేశ్, గోవర్ధన్, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, రమేశ్, జగదీశ్, వేణుగోపాల్, భోజన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు నేత్ర వైద్యశిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 25న రిటైర్డ్ ఉద్యోగుల కోసం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మారెడ్డి, కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: జీవో 317 ద్వారా జిల్లాకు బదిలీపై వచ్చి వారి సొంత జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న 81 మంది ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో పరిశీలించారు. బోనఫైడ్, మెడికల్ గ్రౌండ్, మ్యూచువల్, స్పౌజ్ కేటగిరిలకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. కాగా, ఎక్కువ మంది నిర్మల్ జిల్లాకు బదిలీపై వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నవారు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంటువ్యాధులతో పాటు దోమల కారణంగా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, టైఫాయిడ్ బారిన పడే ప్రమాదం ఉంటుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కూలర్లు, కొబ్బరి బోండాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వారానికి రెండుసార్లు డ్రైడే పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో 163 గ్రామాలను కటాఫ్ గ్రామాలుగా గుర్తించి గర్భిణుల కోసం బర్త్ వెయిటింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వర్షాలతో ఎలాంటి ఇబ్బందులున్నా కంట్రోల్ రూమ్‌ను 8639523332 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నిరాదరణే..!





- కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరుపు
- విమర్శలు గుప్పిస్తున్న విపక్షం
- బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపించినా వివక్షేనని విసుర్లు
- బడ్జెట్‌ను సమర్థిస్తున్న బీజేపీ

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్‌పై ఏదైన స్పష్టత వస్తుందా..? ఆదిలాబాద్ నుంచి గడ్‌చందూర్‌కు నూతన రైల్వేమార్గం నిర్మాణంలో అడుగు పడుతుందా..? రైల్వే బ్రిడ్జిల నిర్మాణంలో పురోగతి ఉంటుందా..? జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్ట్.. లేనిపక్షంలో ఎయిర్‌ఫోర్స్ నిర్మాణంపై దృష్టి సారిస్తారా..? ఇలా అనేక అంశాల్లో కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజలు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. అసలు వాటి ఊసే లేకుండా పోయింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కార్ మంగళవారం పార్లమెంట్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ లోకసభలో 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

కేంద్రంపై ప్రతిపక్షాల విమర్శలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేపీ నుంచి నలుగురిని ఎమ్మెల్యేలుగా, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గెలిపించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంపై పట్టించుకోలేదని విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తెలంగాణపై వివక్ష చూపిందని ఆరోపిస్తున్నారు. మరోవైపు బీజేపీ మాత్రం అన్ని శాఖల్లో కేంద్రం వాటా ఉంటుందని, తద్వారా జిల్లా ప్రజలకు ప్రయోజనం దక్కుతుందని పేర్కొంటూ ప్రతిపక్షాల విమర్శలు దాటవేస్తున్నారు.

కొన్నింటిలోనే ఊరట..

నూతన విధానంలో రూ.3లక్షల వరకు పన్ను రాయితీ పెంచారు. గతంలో ఇది రూ.2.50 లక్షల వరకు ఉండగా, తాజాగా కొంత పెరగడం ఊరటనిచ్చింది. అయితే నూతన పన్ను విధానంలో వేతన జీవులకు కొంత ఊరటనిచ్చేలా చూపించినప్పటికీ పొదుపు చేసుకునే మార్గాల్లో పన్ను రూపంలో భారం పెంచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. తద్వారా ఇది వేతన జీవులకు నిరాశ మిగిల్చిందని పలువురు పేర్కొంటున్నారు. కాగా, బంగారం, వెండిపై 6 శాతం వరకు కస్టమ్ డ్యూటీ తగ్గించడం ద్వారా ఆ ధరలు తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. మూడు రకాల ఔషధాలపై కస్టమ్ డ్యూటీ ఫ్రీ ప్రకటించడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపయోగించే ఆ మందుల విషయంలో జనాలకు ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ముద్ర రుణాలను రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచడం ద్వారా సూక్ష్మ రుణాల పంపిణీలో మరింత మంది పేదలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పట్టణాల్లో గృహ నిర్మాణాలకు రూ.10 లక్షల కోట్లు కేటాయించడం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఉన్నతవిద్య చదివే వారికి రూ.10లక్షల వరకు రుణం పొందేలా వెసులుబాటు కల్పించడంపై స్పందన వస్తోంది. దేశంలో 25వేల గ్రామాలకు కొత్త రోడ్లు నిర్మించేందుకు ఈ బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయడం, దాంట్లో రాష్ట్రంలోని అనేక గ్రామాలకు కూడా ప్రయోజనం దక్కుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం ప్రధానమంత్రి ప్యాకేజీలో పొందుపర్చడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారంలో కొంత ఉపయుక్తంగా ఉంటుందన్న అభిప్రాయం పలువురిలో వినిపిస్తోంది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయించడంతో ఆయా రంగాల్లోని జిల్లా ప్రజలకూ ప్రయోజనం దక్కుతుందని విశ్వాసం వ్యక్తంజేస్తున్నారు.


ముమ్మాటికీ రాజకీయ బడ్జెట్



ఇది ముమ్మాటికీ రాజకీయ బడ్జెట్. మరోసారి తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. పార్లమెంట్‌లో ప్రశ్నించే సభ్యులు లేకనే రాష్ట్రానికి ఈ దుస్థితి పట్టింది. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ హక్కుల కోసం పోరాడుతుంది. బడ్జెట్ ద్వారా తెలంగాణను వెక్కిరించారు.

– జోగు రామన్న, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

అందరికీ ఆమోదయోగ్యమే..



కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్రాలకు అన్వయించి చూడకూడదు. అన్ని శాఖల పథకాల్లో కేంద్రం వాటా తప్పకుండా ఉంటుంది. ఇది అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్. అనేక పథకాల రూపంలో మనకు కూడా ప్రయోజనం దక్కుతుంది.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

తెలంగాణపై వివక్ష



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి నలుగురు బీజేపీ నేతలను ఎమ్మెల్యేలుగా, ఒకరిని ఎంపీగా ప్రజలు గెలిపించారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎమ్మెల్యేలుగా, ఎనిమిది మంది ఎంపీలుగా ఆ పార్టీ నుంచి గెలిచారు. అయినా కేంద్ర బడ్జెట్‌లో ప్రధాని మోదీ వివక్ష చూపారు.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

జిల్లా ప్రజలకు అవమానం



పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం జిల్లా ప్రజలను అవమానించడమే. సీసీఐ పునరుద్ధరణకు నోచుకుంటుందని జిల్లా ప్రజలు ఆశపడ్డారు. చివరికి బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపడం ద్వారా కేంద్రంలోని బీజేపీ కపట నాటకం బయటపడింది.

– దర్శనాల మల్లేశ్, సీపీఎం జిల్లా కార్యదర్శి

వేతన జీవులకు నిరాశే..



పొదుపు మార్గాలపై పన్ను రూపంలో భారం పెంచి వేతన జీవులకు నిరాశ కలిగించారు. మ్యూచువల్ ఫండ్, స్టాక్ మార్కెట్, ఎఫ్‌డీలపై వచ్చిన లాభాలపై పన్ను భారం పెంచారు. నూతన విధానంలోనూ హౌసింగ్ లోన్ సెక్షన్ 80సీ, 80డీ వర్తింపజేయాలి.

– శివకుమార్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగోన్నతులకు కసరత్తు

ఆదిలాబాద్‌టౌన్: ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించిన విషయం తెలిసిందే. మిగతా ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. ఇటీవల జిల్లాలో 420 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. ఈ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా చేపట్టారు. ఆయా కేటగిరిలకు సంబంధించి కొందరు రెండు, మూడు సబ్జెక్టులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొందరికి రెండు సబ్జెక్టుల్లో ప్రమోషన్ లభించింది. వీరిలో 42 మందికి రెండేసి పోస్టుల్లో ప్రమోషన్ లభించగా, వారు ఒక పోస్టు ఎంచుకున్నారు. మిగతా ఖాళీలను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వానికి విన్నవించగా సానుకూలంగా స్పందించింది. సీనియారిటీ జాబితా తయారు చేయాలని ఆదేశించగా, అధికారులు అదే పనిలో ఉన్నారు. ప్రమోషన్లకు సంబంధించి పీఎస్ హెచ్‌ఎంలో–14, స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రం–13, బయోసైన్స్–4, ఇంగ్లిష్–7, ఫిజికల్ సైన్స్–2, స్కూల్ అసిస్టెంట్ తెలుగు–1, స్కూల్ అసిస్టెంట్ హిందీ–1, మొత్తం 42 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది.



సీనియారిటీ జాబితా తయారు చేస్తున్న ఉద్యోగులు

లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కైలాస్‌నగర్: మహిళా శక్తి లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలకు మైక్రో ఎంటర్ ప్రైసెస్, మీసేవ కేంద్రాలు, కుట్టు మిషన్ కేంద్రాల ఏర్పాటుపై ఓరియంటేషన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలో 167కుట్టుమిషన్ కేంద్రాలకు 1,050 మందిని గుర్తించామన్నారు. 3,929 మైక్రో ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లకు గాను 3,124 మందిని గుర్తించామని, 19 మీసేవ కేంద్రాలకు గాను 19మందిని గుర్తించామని వివరించారు. డీఆర్డీవో సాయన్న, మహిళా శక్తి సభ్యురాలు వనజ తదితరులున్నారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: కేంద్రం తెచ్చిన నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ గౌస్ ఆలం సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోగల సమావేశ మందిరంలో మంగళవారం జిల్లాలోని పోలీస్ అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ప్రతీ పోలీస్‌స్టేషన్, పోలీస్ కార్యాలయంలో 5ఎస్‌ను అమలు పర్చాలని సూచించారు. సైబర్ నేరాలకు గురైన బాధితుల ధనాన్ని తిరిగి ఇచ్చేలా కోర్టులు, బ్యాంకులను సంప్రదించి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా జైనథ్, బేల పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 14మందికి పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లు అందజేశారు. డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

కైలాస్‌నగర్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మంగళవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై విధాన నిర్ణయం తీసుకుని త్వరలోనే మంజూరు చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థినికి ల్యాప్‌టాప్ ఇస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థిని ఉన్నతి మాన్యకు జిల్లా దళితాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మంజూరైన ల్యాప్‌టాప్‌ను మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా అందజేశారు. డీఎస్సీడీవో సునీతాకుమారి, సూపరింటెండెంట్ పూర్ణచందర్, డీఈవో సాయి తదితరులున్నారు.

బల్దియా అధికారుల బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాల్‌టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ టౌన్ కంట్రీ ప్లానింగ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ టీపీవో జీ అనురాధ భైంసాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో భైంసా టీపీవో సుమలత ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఆదిలాబాద్ టీపీఎస్ సాయికిరణ్ నిర్మల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో నిర్మల్ టీపీఎస్ నవీన్‌కుమార్ ఇక్కడకు బదిలీ అయ్యారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న ఎండీ సాజిద్ అలీ ఇక్కడకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కాగా, బోధన్ మున్సిపల్ నుంచి ఆదిలాబాద్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చిన బీ శంకర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కలెక్టరేట్‌లో 24/7 కంట్రోల్‌రూం

కైలాస్‌నగర్: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో 24/7 ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగులను కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉదయం 6నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కాశీరాం, మహ్మద్ షఫీ, మధ్యాహ్నం 2నుంచి రాత్రి 10గంటల వరకు సయ్యద్ అనిజ్, ఎన్.అశోక్, రాత్రి 10నుంచి ఉదయం 6గంటల వరకు జీ సుభాష్, డీ లక్ష్మణ్ విధుల్లో ఉంటారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 1800 4251939 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. ఎలాంటి సమస్య తలెత్తినా అధికారులు అక్కడకు చేరుకుని సమస్య పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- రోడ్లపై గుంతలు పూడుస్తాం
- పశువులను సంచరించనివ్వం
- స్ట్రీట్‌లైట్లు వెలిగేలా చూస్తాం
- 'సాక్షి ఫోన్ ఇన్'లో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకచర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖమర్ అహ్మద్ తెలిపారు. పశువుల యజమానులకు నోటీసులిచ్చి మూగజీవాలను రోడ్లపై సంచరించకుండా చూస్తున్నామని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవలి వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ప్రతీ కాలనీలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

ప్రశ్న: టైలర్స్ కాలనీ నుంచి బట్టిసావర్‌గాంవ్‌కు వెళ్లే మార్గంలో వంతెన వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. వర్షపునీరు నీరు నిలిచి రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– దేవురావు, కానిస్టేబుల్

కమిషనర్: ఇంజినీరింగ్ అధికారులతో రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న: సంజయ్‌నగర్ కాలనీలోని కేజీబీవీ సమీపంలోగల పోచమ్మ ఆలయం వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. నాలుగురోజులుగా మా కాలనీకి చెత్త బండి కూడా రావడం లేదు.

కమిషనర్: మున్సిపల్ కార్మికులను పంపించి పిచ్చిమొక్కలు తొలగిస్తాం. వార్డు జవాన్‌తో మాట్లాడి చెత్తవాహనాన్ని కాలనీకి పంపిస్తాం.

ప్రశ్న: పట్టణంలోని పలు రోడ్లపై పశువులు సంచరిస్తున్నాయి. కాలనీల్లో కుక్కల బెడద అధికమైంది. జగ్జీవన్‌రాం చౌక్ వద్ద రోడ్డుపై నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు పిచ్చిమొక్కలు పెరిగాయి.

– లోక ప్రవీణ్‌రెడ్డి, కైలాస్‌నగర్

కమిషనర్: రోడ్లపై పశువులు సంచరించకుండా ఇప్పటికే చర్యలు చేపట్టాం. కుక్కలు పట్టే ప్రక్రియ సాగుతోంది. త్వరలో పిచ్చిమొక్కలు తొలగిస్తాం.

ప్రశ్న: న్యూహౌసింగ్‌బోర్డు పరిధిలో ఎల్ఐసీ ఏజెంట్లు ప్రభుత్వ భూమిలో అక్రమంగా లేఅవుట్ ఏర్పాటు చేశారు. రెగ్యులరైజేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు కూడా చేశారు. చర్యలు తీసుకోవాలని రెండు నెలలుగా టౌన్ ప్లానింగ్ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు.

– జహీర్ రంజానీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్

కమిషనర్: ఎంపీ ఎన్నికలు, ఉద్యోగుల బదిలీల్లో బిజీగా ఉండి దానిపై దృష్టి సారించలేకపోయాం. కొత్తగా విధుల్లో చేరనున్న అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ఎల్ఆర్ఎస్‌పై మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌ను సంప్రదించి వారి అభిప్రాయం మేరకు చర్యలు చేపడతాం.

ప్రశ్న: భాగ్యనగర్ కాలనీలోని టీ/9, 2/2 స్తంభాలపై నెల రోజులుగా వీధిదీపాలు వెలగడం లేదని సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకుంటలేరు. కాలనీలోని కచ్చా డ్రెయిన్ పూడికతో నిండి మురుగునీరు బయటకు వెళ్లడంలేదు.

– సాయికుమార్, భాగ్యనగర్



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ ఖమర్ అహ్మద్

కమిషనర్: తక్షణమే స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయిస్తాం. పారిశుధ్య కార్మికులను పంపించి డ్రైయినేజీని శుభ్రం చేయిస్తాం.

ప్రశ్న: విద్యానగర్‌లోని ప్రభుత్వ గజిటెడ్ ఉన్నత పాఠశాల వెనుకభాగంలోగల రోడ్డుపై పిచ్చిమొక్కలు పెరిగాయి. డిపో పక్కనుంచి విద్యానగర్‌కు వెళ్లే రోడ్డు గుంతలు పడి వర్షపునీరు నిలుస్తోంది.

– యాదగిరి, విద్యానగర్

కమిషనర్: పట్టణంలోని ఆయా కాలనీల్లో పిచ్చిమొక్కలు తొలగించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. రోడ్లపై గుంతలు పూడ్చేలా చూస్తాం.

ప్రశ్న: జాతీయ రహదారి నుంచి మహాలక్ష్మివాడకు వెళ్లే గణేశ్‌మందిర్ సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద హైమాస్ట్‌లైట్లు వెలగడం లేదు. వర్షపు నీరు బ్రిడ్జి కింద నిలుస్తోంది. మురికివార్డుల్లో వీధి దీపాలు వెలగడంలేదు. సమస్య పరిష్కరించాలి.

– సంద నర్సింగ్, కౌన్సిలర్ మహాలక్ష్మివాడ

కమిషనర్: హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే నోటీసులు జారీ చేస్తాం. రేపటివరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపడతాం. ప్రతీ కాలనీలో వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పట్టణంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌ల్లో కొన్ని ప్రమాదకరంగా మారాయి. ఎన్టీఆర్‌చౌక్‌లో బల్దియా ఏర్పాటు చేసిన రెయిలింగ్‌కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో అవి ధ్వంసమవుతున్నాయి.

– సామ రూపేశ్‌రెడ్డి, విద్యానగర్

కమిషనర్: అనుమతి లేని హోర్డింగ్‌లు ఎక్కడా లేవు. ఎక్కడైనా ప్రైవేట్ బిల్డింగ్‌లపై మాకు తెలియకుండా ఏర్పాటు చేసి ఉంటే తొలగించివేస్తాం. రెయిలింగ్‌కు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనివ్వం.

ప్రశ్న: న్యూ హౌసింగ్‌బోర్డు పరిధిలోని జోన్ 1, 2తో పాటు 170 కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– నాగరాజు, న్యూహౌసింగ్‌బోర్డు

కమిషనర్: పట్టణంలోని వివిధ కాలనీల్లో కుక్కలు పట్టే ప్రక్రియ కొనసాగుతోంది. మీ కాలనీలోనూ కుక్కలు పట్టించేలా చూస్తాం.

ప్రశ్న: రిక్షా కాలనీలోని వైష్ణవి మోడల్ స్కూల్ సమీపంలోగల అంతర్గత రోడ్డుపై మోకాల్లోతూ గుంతలు ఏర్పడ్డాయి. కౌన్సిలర్‌కు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– మంగేశ్‌కుమార్ దేవుతాడే, రిక్షాకాలనీ

కమిషనర్: వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే రోడ్లపై గుంతలు పూడ్చే చర్యలు చేపడతాం.

కమిషనర్ తక్షణ స్పందన



గుంతల్లో డస్ట్ నింపుతున్న టిప్పర్

'సాక్షి ఫోన్ ఇన్'లో వచ్చిన సమస్యకు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తక్షణమే స్పందించారు. టేలర్స్ కాలనీ నుంచి బట్టిసావర్‌గాంవ్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారిందని ఆ కాలనీకి చెందిన కానిస్టేబుల్ దేవురావు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన కమిషనర్ సమస్య తెలుసుకోవాలని డీఈ తిరుపతిని అక్కడికి పంపించారు. డీఈ రోడ్డును పరిశీలించి సమస్యను కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ సూచన మేరకు డీఈ వెంటనే టిప్పర్లతో స్టోన్ డస్ట్ తీసుకువచ్చి సిబ్బందితో రోడ్లపై గుంతలు పూడ్చే చర్యలు ప్రారంభించారు.

క్లుప్తంగా

బాసరలో ఆర్జేడీ పూజలు


ఆర్జేడీని సత్కరిస్తున్న అధికారులు

బాసర: బాసర సరస్వతీ అమ్మవారిని మంగళవారం వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు, శాలువాతో సత్కరించి పూలమాల అందజేశారు. కార్యక్రమంలో అల్జాపూర్ సుధాకర్, ఎంఈవో మైసాజీ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి


మాట్లాడుతున్న రాములు మహరాజ్

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని నందిపేట్ పలుగుట్ట బాల యోగి రాములు మహరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మోరలో గ్రామస్తుల సహకారంతో చేపట్టిన హనుమాన్ మందిర నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలన్నారు. వ్యసనాలకు గురి కావద్దన్నారు. ఆయన వెంట నాయకులు మామిడి సంజీవ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, సాయాగౌడ్, మంద భాస్కర్, సాయన్న, భూమయ్య, మంద శ్రీధర్, లింగయ్య, చిన్నయ్య, తదితరులు ఉన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగలో గల్లంతైన ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) గ్రామానికి చెందిన కొంత శివ (20) మృతదేహం లభ్యమైంది. సోమవారం డీడీఆర్ఎఫ్ బృందాలు పెన్‌గంగలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. మంగళవారం డొల్లార గ్రామానికి కూత వేటు దూరంలో పెన్‌గంగ నది ఒడ్డున మృతదేహం నీటిపై తేలడంతో డీడీఆర్ఎఫ్ బృందాలు బయటకు తీశాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించినట్లు సీఐ సాయినాథ్ తెలిపారు.

ఉద్యమకారుల సంఘం ఇన్‌చార్జిగా శ్రావణ్‌నాయక్

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జాదవ్ శ్రావణ్ నాయక్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు అధ్యక్షులను నియమించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా పిడమర్తి రవితో కలిసి ఆయన మంగళవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


మృతి చెందిన గేదె

కడెం: మండలంలోని లింగాపూర్‌లో దేశెట్టి చిన్నరాజన్నకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం మేతకు వెళ్లిన గేదెకు గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై రాత్రి మృతి చెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

పట్టపగలే చోరీలు..



- నడిరోడ్డుపైనే నగలు లాక్కెళ్తున్న వైనం
- జిల్లాలో వరుసగా దొంగతనాలు
- పక్కా ప్లాన్లతో వస్తున్న దుండగులు
- తాళం వేసిన ఇళ్లు, రద్దీ ప్రాంతాలే లక్ష్యం

నిర్మల్‌టౌన్: జిల్లాలో పట్టపగలే దొంగలు రెచ్చిపోతున్నారు. పోలీసులు ఎంత పకడ్బందీగా చర్యలు చేపడుతున్నా చోరీలు ఆగడం లేదు. సాక్షాత్తూ జిల్లా కేంద్రంలో.. అదికూడా పట్టపగలు ప్రధాన రహదారిపై అందరూ చూస్తుండగానే.. ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లారంటే దొంగలు ఎంతకు తెగించారో ఇట్టే తెలిసిపోతోంది. ఇదే రోజు మరో కాలనీలోనూ చైన్‌స్నాచింగ్ జరగడం సంచలనం రేకెత్తించింది. ఇటీవల జిల్లా వ్యాప్తంగా వరుసగా చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు జరుగుతుండటం జిల్లా వాసులను కలవర పెడుతున్నాయి.

ఇంటికి తాళముంటే.. దోసుడే..

ఇంటికి తాళం వేసి ఊరెళ్తున్నారా..? అయితే జాగ్రత్త.. ఎందుకంటే మీరు అలా వెళ్లగానే మీ ఇంట్లో దొంగలు పడే ప్రమాదం ఉంది. గతంలో వేసవిలో రాత్రివేళ దొంగతనాలు జరిగేవి. కానీ ప్రస్తుతం సీజన్ ఏదైనా ఉదయం, రాత్రితో సంబంధం లేకుండా దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. పక్కా ప్లాన్‌తో తాళం వేసిన ఇండ్లు దుకాణాల్లో నగదు, విలువైన వస్తువులతో పాటు, వాహనాలను కూడా ఎత్తుకెళ్తున్నారు. మార్కెట్, బస్టాండ్ తదితర రద్దీ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్లు, చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు.

పోలీసుల కళ్లు గప్పి...

నిఘా విభాగంలో ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా దొంగలు పోలీసుల చేతికి చిక్కకుండా తప్పించుకు తిరుగుతుండడం గమనార్హం. రాత్రి, పగలు పోలీసులు గస్తీ కాస్తున్నా వారి కళ్లు గప్పి మరి దొంగలు తమ చేతికి పని చెబుతున్నారు. పోలీసులకు ఎటువంటి ఆనవాళ్లు దొరకకుండా జాగ్రత్త పడుతున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చెమటలు పట్టిస్తున్నారు.

పక్క రాష్ట్రం నుంచి..

నిర్మల్ జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. అంతే కాకుండా జిల్లాలో 44, 61వ జాతీయ రహదారులు ఉండడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి వచ్చిన వ్యక్తులు నేరుగా దొంగతనాలు చేసి పారిపోతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చైన్ స్నాచింగ్‌లు..

జిల్లా కేంద్రంలో మంగళవారం పట్టపగలే బైక్ వచ్చిన దొంగలు వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల మెడలో నుంచి చైన్‌లు లాక్కెళ్లారు. స్థానిక మయూరి హోటల్ సమీపంలోని వైన్స్ ఎదుట ప్రధాన రహదారిపైనే అందరూ చూస్తుండగా చైన్‌స్నాచింగ్ జరగడం తీవ్ర సంచలనమైంది. జిల్లా వ్యాప్తంగా ఇది చర్చనీయాంశంగా మారింది. అలాగే శాస్త్రినగర్‌లో బైక్‌పై వచ్చిన దొంగలు మరో మహిళ మెడలోనుంచి గొలుసు లాక్కెళ్లడం కలవర పెట్టింది. దీంతో మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..

- ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ కాలనీకి చెందిన శ్రావణి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారని వాపోయింది.
- ఈనెల 14న కుభీర్‌లో అద్దె ఇంట్లో ఉండే వ్యక్తి తాళం వేసి ఊరికి వెళ్ళాడు. తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి ముందర ఉన్న బైక్, ఇంట్లో ఉన్న రూ.7 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- గత వారం దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో ఉన్న ఓ వైన్‌షాపు తాళాలు రాత్రి సమయంలో పగలగొట్టి రూ.3 వేల నగదును దొంగిలించారు.
- ఈనెల 20న నర్సాపూర్(జి) గ్రామ శివారులోని నీలిమ వైన్స్, తెల్ల కల్లు దుకాణాల షట్టర్ తాళాలు పగులగొట్టి సీసీ కెమెరాలు ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు.
- ఈనెల 20న జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్‌లో గల రెండు పాన్‌షాపుల తాళాలు పగలగొట్టి రూ.10 వేల నగదు అపహరించారు.
- ఈనెల 22న ఖానాపూర్ పట్టణంలోని ఓ ఇంట్లో దొంగలు పడి ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.

ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

బేల: ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య, భోజనంపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హాజరు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువల ఆహారం అందించాలన్నారు. వర్షాల నేపథ్యంలో వసతిగృహ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు లక్ష్మణ్, దిలీప్, జ్యోతి, సుమిత్రల సెలవును హాజరు రిజిష్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.శ్వేతకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఐదురోజులుగా సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయుడు దశరథ్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చా రు. ఇక్కడ పనిచేస్తున్న శంభు తన స్థానంలో వేరే వాళ్లతో పనిచేయిస్తుండడంతో ఆగ్రహం వ్యక్తం చేశా రు. ఇకనుంచి ఎవరి ఉద్యోగం వారే చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఏటీడీవోను ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్జీయూకేటీలో ముగిసిన దివ్యాంగుల కౌన్సెలింగ్


విద్యార్థినికి పత్రాన్ని అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆరు సంవత్సరాల సమీకృత విద్యనభ్యసించేందుకు పీయూసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దివ్యాంగ విద్యార్థులకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వర్సిటీ ప్రాంగణంలోని అకడమిక్ బ్లాక్‌లో దివ్యాంగ విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలించారు. ఉదయం 9 గంటల నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ ఆదేశాల మేరకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. సిద్దిపేట జిల్లా పెద్ద లింగారెడ్డి గ్రామానికి చెందిన హారికకు ఎంపిక ధ్రువపత్రాన్ని స్పెషల్ ఆఫీసర్ సృజన, కన్వీనర్ డాక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. మిగిలిన సీట్ల ఖాళీలను మూడో విడతలో భర్తీ చేస్తామని, దానికి సంబంధించిన జాబితాను త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. గ్లోబల్ కోటా స్వరాష్ట్రం సీట్లను సైతం భర్తీ చేస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌లో జాయింట్ కన్వీనర్లు రంజిత్‌కుమార్, డాక్టర్ దత్తు, అడ్మిషన్స్ కమిటీ సభ్యులు హరికృష్ణ, సునీత, డాక్టర్ కుమార్ రాగుల, శ్రీకాంత్, రాకేశ్‌రెడ్డి, ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ, ఎస్బీఐ క్యాంపస్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

ఒకేరోజు రెండు చోట్ల చైన్‌స్నాచింగ్


మయూరి హోటల్ వద్ద ఘటన సీసీ ఫుటేజీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్ వద్ద ఓ మహిళ నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో నుంచి తులం బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాలో దృశ్యాలను పరిశీలించారు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మహిళ నిర్మల్‌లో ఉంటున్న తన కూతుర్ని చూడడానికి వచ్చిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

శాస్త్రినగర్‌లో...

జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన ఓ మహిళ శాస్త్రినగర్‌లోని తన బంధువుల ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. మహిళా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిర్మల్ డిగ్రీ కళాశాల అరుదైన ఘనత


ధ్రువీకరణపత్రంతో కూడిన మెమెంటోను అందజేస్తున్న హైమ్ సంస్థ ప్రతినిధి



అంతర్జాతీయ సంస్థ ధ్రువీకరణపత్రం ఇదే

- మూడు విభాగాల్లో ఉత్తమ పురస్కారాలు
- డిగ్రీ కళాశాలకు అంతర్జాతీయ సంస్థ గుర్తింపు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరుదైన ఘనతను చాటుకుంది. డిగ్రీ కళాశాలలో మంచి వసతులతోపాటు నాణ్యమైన విద్యా బోధనాభ్యసన చేపడుతుండడంతోపాటు విద్యా ప్రమాణాలు, వనరుల నిర్వహణ, పర్యావరణం తదితర విభాగాల్లో అంతర్జాతీయ సంస్థ గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక 'హైమ్ అంతర్జాతీయ సంస్థ' ఆడిట్ ప్రతినిధులు కళాశాలను సందర్శించి వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాలలో మౌలిక వసతులు, క్రీడామైదానం, ప్రహరీ, తరగతి గదులు, పరిపాలన విభాగం, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, వర్చువల్ ప్రయోగశాల, ఇంగ్లిష్ భాష ప్రయోగశాల, తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జి ల్యాబ్, భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్ర ప్రయోగశాలలతోపాటు జంతుశాస్త్ర మ్యూజియం, సెమినార్ హాల్, డిజిటల్ క్లాస్‌రూమ్, పార్కింగ్ స్థలం, బొటానికల్ గార్డెన్, క్రీడా సామగ్రి, నీటి వసతులు పర్యావరణ నిర్వహణ వంటి వాటిని సమగ్రంగా పరిశీలించారు. వీటితోపాటు పరిపాలన విభాగం నిర్వహణ, అకడమిక్ రికార్డ్స్ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా విభాగాలకు సంబంధించిన ధ్రువపత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.భీమారావుకు మంగళవారం అందజేశారు. అంతర్జాతీయ సంస్థ గుర్తింపు రావడంపై ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు విదేశాలలో చదవాలనుకునే వారికి మంచి గుర్తింపు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు హైమ్ అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు ఉత్తమ విద్యా ప్రమాణాలు–నిర్వహణ, ఉత్తమ వనరుల నిర్వహణ, ఉత్తమ పర్యావరణ నిర్వహణ అనే మూడు విభాగాలలో ధ్రువీకరణ పత్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో హైమ్ సంస్థ ప్రతినిధి శివ, కళాశాల అధ్యాపకులు అతీక్ బేగం, రఘు, అరుణ్‌కుమార్, అజయ్, పీజీ.రెడ్డి, రవికుమార్, రమాకాంత్‌గౌడ్, సరితారాణి, నరసయ్య, నాగేశ్వర్, శంకర్, శ్రీహరి, ఏవో నాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీ పనులపై కలెక్టర్ ఆగ్రహం


అర్జుని మారుగూడ రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

నార్నూర్: మీ ఇంట్లో వస్తువు పాడైతే ఇలాగే వదిలేస్తారా? ఇంత నిర్లక్ష్యం ఎందుకని కలెక్టర్ రాజర్షిషా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాదిగూడ మండలంలోని పర్సువాడ కే ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ అదర్శ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలలో మంచి నీటి సౌకర్యం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించగా హెచ్‌ఎం బదిలీపై వెళ్లాడని, తాను చార్జి తీసుకుని రెండురోజులు మాత్రమే అవుతుందని ఉపాధ్యాయురాలు రమబింధు తెలిపారు. పనులు ఎందుకు అసంపూర్తిగా ఉన్నాయని ఐటీడీఏ డీఈ శివప్రసాద్‌ను ప్రశ్నించారు. 31 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా బేల ఎంఈవోతో మాట్లాడి బదిలీ అయిన ఉపాధ్యాయుని వెంటనే రిలీవ్ చేయాలని ఎంఈవో రాపల్లి ఆశన్నను ఆదేశించారు. ధర్మగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు కోతకు గురి కావడంతో గ్రామస్తులతో కలిసి వెళ్లి పరిశీలించారు. రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని పీఆర్ జేఈ లింగన్నను ఆదేశించారు. అనంతరం అర్జుని గ్రామ పంచాయతీ పరిధిలోని మారుగూడ వాగును పరిశీలించారు. ఝరి పీహెచ్‌సీని తనిఖీ చేసి రిజిస్టర్లు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ విజయానందం, ఎంపీడీవో రమేశ్, సీడీపీవో శారద, ఐటీడీఏ డీఈ శివప్రసాద్, ఎంఈవో రాపల్లి ఆశన్న, తదితరులు ఉన్నారు.

మద్రాస్ ఐఐటీలో ముధోల్ విద్యార్థికి సీటు


విద్యార్థి అమన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ముధోల్: ముధోల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివిన జెడ్.అమన్ మద్రాస్ ఐఐటీలో సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో అమన్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు భాస్కర్, రాములు, శ్రీధర్, సీతారాం, ప్రేమ్‌కుమార్, రవీందర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీని సన్మానించిన కలెక్టర్


మెమొంటో అందజేస్తున్న కలెక్టర్

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(బి) మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌ను మంగళవారం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రామీణ స్వచ్ఛ భారత్ శిక్షణ శిబిరానికి గాడ్గే సుభాష్ ప్రత్యేక ఆహ్వానితులుగా వెళ్లి పంచాయతీ అభివృద్ధిపై అనుభవాలు వివరించారు. తడి, పొడి చెత్త ద్వారా వర్మికంపోస్టు తయారు చేసి ఆదాయం సంపాదించిన విషయంలో కలెక్టర్ అభినందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

సోన్: మండల కేంద్రంలోని ఫారెస్ట్ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై కే.గోపి, ఫారెస్ట్ బీట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్ర నుంచి గోధుమ లోడ్‌తో లారీ హైదరాబాద్ బయలుదేరింది. సోన్ చెక్‌పోస్ట్ వద్ద అటవీ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా నిలిపి ఉన్న బొలెరో, పికప్ వాహనాలను లారీ బలంగా ఢీకొట్టింది. ముందున్న రెండు వాహనాల డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షత గాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.


పూజలు చేస్తున్న బంజారాలు

ఘనంగా శీత్లాభవాని పండుగ


సంప్రదాయ దుస్తుల్లో మహిళలు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, సత్తన్‌పల్లి, బావాపూర్(ఆర్) తదితర గ్రామాల్లో శీత్లాభవాని పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా కులస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు నిర్మల్ యువకుడు


తుమ్మల శశివర్ష

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకేంద్రంలోని ప్రియదర్శిని నగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుమ్మలదేవరావు తనయుడు తుమ్మల శశివర్ష జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల వనపర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో అధికారులు జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఈనెల 24 నుంచి 28 వరకు గోవాలో జరిగే జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో శశివర్ష పాల్గొంటారు. శశివర్ష గతంలో కరాటేలో జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాడు. కిక్ బాక్సింగ్‌లో రాణిస్తూ జాతీయస్థాయిపోటీలకు ఎంపికవడంపై జిల్లా కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు చందల స్వామి, జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ అభినందించారు.

భార్య కాపురానికి రావడంలేదని ఆత్మహత్య

నార్నూర్: మండల కేంద్రంలోని జీన్‌గూడకు చెందిన సయ్యద్ ఆసిఫ్ (22) మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. జీన్‌గూడకు చెందిన సయ్యద్ ఆసిఫ్‌కు ఈ ఏడాది ఏప్రిల్ 29న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన రేషమ్‌తో వివాహమైంది. ఇటీవల పుట్టింటికి వెళ్లిన రేషమ్ మళ్లీ తిరిగిరాలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి సయ్యద్ ఆజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

నిర్లక్ష్యానికి నిలువుటద్దం..



విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రం నిలువుటద్దంగా నిలుస్తోంది. సింగిల్ ఫేస్ 15 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మావల మండలంలోని మురుగునీటి కాలువలో పడేసి ఉంది. ఒకవేళ అది చెడిపోయినప్పటికీ కూడా విద్యుత్ శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి మరమ్మతులు చేయించాలి. కానీ నిర్లక్ష్యంగా పడేయడం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
TO-LET
■ 1200Sft నుండి 2400Sft వరకు కమర్షియల్ బిల్డింగ్ షాప్స్, బ్యాంక్, ఫైనాన్స్, ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. ఇ.నెం. 8-544, శ్రీనివాస్ టాకీస్ దగ్గర, మేన్‌రోడ్, మంచిర్యాల. సంప్రదించండి సెల్: 9959957741, 9848578233 [K-1187164]

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185359]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన బోథ్ ఎమ్మెల్యే



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ: అసెంబ్లీ సమావేశాల తర్వాత ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బోథ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు రాహుల్ ముండే, రాథోడ్ సురేందర్ తదితరులు ఉన్నారు.

ధర్నాలో పాల్గొనాలి



మాట్లాడుతున్న రాజు

ఇచ్చోడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నాకు జిల్లాలోని కార్మికులు తరలిరావాలని కోరారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి గంగయ్య, నాయకులు అర్జున్, విలాస్ పాల్గొన్నారు.

ఎదులాపురం: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 26 హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర కార్యదర్శి గాజంగుల రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్మిక అడ్డా వద్ద మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఈ ధర్నాలో కార్మికులు పాల్గొనాలని కోరారు. ఆశన్న, రాజు, సుభాష్, శంకర్, జగదీశ్, మహేందర్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న మౌనిష్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన ఉప్పరి రమేశ్ గతకొన్ని రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో బాధితుడి సమస్యను తెలుసుకున్న తిరుమల ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ముడుపు మౌనిష్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. మంగళవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.6వేల నగదుతోపాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఆర్టీసీ డీఎం కల్పన

కైలాస్‌నగర్: కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఒక మొక్క నాటి సంరక్షించాలని ఆర్టీసీ డీఎం కల్పన సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. 'ఈచ్ వన్.. ప్లాంట్ వన్' నినాదంతో ఆర్టీసీ కార్మికులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్బన్ మోనాక్సైడ్ శాతం పెరిగి పీల్చుకునే గాలిలో ప్రాణశక్తి తగ్గి పలువురు మానసిక ఆందోళనకు గురవుతున్నారని, వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. మొక్కలు నాటి సంరక్షిస్తే ఆరోగ్యకర జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

ఎదులాపురం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ ఎండీఎం యూనియన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1న నిర్వహించే చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు పిలుపునిచ్చారు. ఇందిరా పార్క్ వద్ద ఉదయం 9 గంటలకు మహాధర్నా ఉంటుందని పేర్కొన్నారు. కార్మికులు హాజరై జయప్రదం చేయాలన్నారు.

బీటీ పనులు ప్రారంభమెప్పుడో?

- సోన్‌పెల్లి నుంచి సిరికొండ వెళ్లేదారి అధ్వానం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- వర్షాకాలంలో తిప్పలు

సిరికొండ: మండలంగా ఏర్పాటు కావడంతో సోన్‌పెల్లి, ఇట్యార్‌గూడ, దోభిగూడ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మండల కేంద్రం చేరువైందని సంబుర పడ్డారు. వివిధ పనుల నిమిత్తం అక్కడికి వెళ్లి త్వరగా రావచ్చన్న ఆశ ఎంతోసేపు నిలువలేదు. మూడు గ్రామాల ప్రజలు 3 కి.మీ దూరాన ఉన్న మండల కేంద్రానికి వెళ్లే దారి కచ్చా రోడ్డే దిక్కయింది. సోన్‌పెల్లి నుంచి ఇచ్చోడ మండలం దాబా మీదుగా పొన్న ఎక్స్‌రోడ్డు వరకు రావాలి. అక్కడి నుంచి 12 కి.మీ దూరం ప్రయాణించి సిరికొండ చేరుకోవాలి. దూరభారం, కాలినడకన వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో అనేక తిప్పలు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా అప్పటి ప్రభుత్వం 2023లో గిరిజన సంక్షేమ పథకం ద్వారా సోన్‌పెల్లి నుంచి మండల కేంద్రం వరకు 3 కి.మీ మేర రూ.2.30 లక్షలతో బీటీ రోడ్డు మంజురు చేసింది. అయినా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రజలు మండలానికి చేరుకోవాలంటే చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇప్పటికైన అధికారులు, నాయకులు స్పందించి బీటీ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



సోన్‌పెల్లికి వెళ్లే కచ్చా రోడ్డు

త్వరగా పనులు ప్రారంభించాలి



గతంలో సోన్‌పెల్లికి బీటీ రోడ్డు మంజురు చేశారు. చాలా సంతోషపడ్డాం. ఇప్పటికి పనులు ప్రారంభించలేదు. ప్రజలు సిరికొండ చేరుకోవాలంటే కచ్చా రోడ్డుపై వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. అధికారులు బీటీ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.


– బస్సేవాడ్ సంతోష్, సోన్‌పెల్లి

ఇబ్బందిగా ఉంది



సోన్‌పెల్లి నుంచి సిరికొండ వెళ్లే రోడ్డు సరిగ్గా లేదు. ప్రభుత్వ కార్యాలయ పని కోసం సిరికొండ చేరాలంటే 12 కి.మీ ప్రయాణం చేయాలి. అధికారులు వెంటనే బీటీ పనులు మొదలు పెట్టి పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలి.

– నాందేవ్, సోన్‌పెల్లి



పెచ్చులూడి ప్రమాదకరంగా మారిన స్లాబ్

శిథిలావస్థలో ఎమ్మార్సీ కార్యాలయం

నార్నూర్: ఎమ్మార్సీ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఉరుస్తోంది. పైకప్పు నుంచి పెచ్చులూడి కిందకు పడుతున్నాయి. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వివిధ పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పుస్తకాలు కార్యాలయంలో కిందనే ఉంచడంతో తడిచిపోతున్నాయి. కార్యాలయంలో విలువైన కంప్యూటర్ సామగ్రి ఉంది. ఎమ్మార్సీకి నూతన భవనం మంజూరు చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.



నేలపైనే పుస్తకాలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం

నేరడిగొండ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానందం అన్నారు. మంగళవారం నేరడిగొండలో పార్టీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులెప్పుడు ప్రజల్లో ఉండాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించా లన్నారు. సమావేశంలో పోడు భూములకు పట్టాలు, డిగ్రీ కళాశాల ఏర్పాటు, గ్రామాలకు రోడ్ల సౌకర్యం, కొత్త పెన్షన్లు, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, కుంటాల జలపాతం అభివృద్ధి, రైతు బీమా, మండల కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం వంటి తీర్మానాలు ప్రవేశపెట్టగా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో బోథ్ అసెంబ్లీ కన్వీనర్ బాబారావ్ పటేల్, జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ రావ్ ఆమ్టే, పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్, రాఘవులు, రాజశేఖర్, నాయకులు నారాయణ్ సింగ్, రాములు, కమల్ సింగ్, నారాయణ, పరశురాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మానందం

బడికి వెళ్లాలంటే తిప్పలే..



నేరడిగొండ: మండలంలోని తేజాపూర్‌లో మండల ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రోడ్డు వర్షాలకు చిత్తడిగా మారింది. బురదలో నుంచే విద్యార్థులు బడికి వెళ్లాల్సి వస్తోంది. రోజు ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు తిప్పలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

రెండు మండలాలకు ఒక్కరే..

- ఎంఈవో నియామకమెప్పుడో..
- పాఠశాలల పర్యవేక్షణ కరువు
- కుంటుపడుతున్న విద్యావ్యవస్థ

నార్నూర్: విద్యావ్యవస్థను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం శాశ్వత ఎంఈవోల నియామకం చేపట్టడం లేదు. దీంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. ఉపాధ్యాయుల సమయపాలన, బోధన నైపుణ్యాలు మెరుగుపర్చే రీతిన సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఎంఈవోల విధులను పాఠశాలల హెచ్‌ఎంలతో నిర్వహిస్తున్న పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఉట్నూర్ మండలంలోని లక్కారం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాపల్లి ఆశన్న నార్నూర్, గాదిగూడ రెండు మండలాలకు ఎంఈవోగా పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇతను గతంలో తడిహత్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తుండగా ఎంఈవో బాధ్యతలు అప్పగించారు. ఇటీవల బదిలీలో భాగంగా లక్కారం జెడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు. మండల కేంద్రానికి దాదాపు 25 కి.మీ దూరం నుంచి పర్యవేక్షణ చేయాలంటే సాధ్యం కావడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఎంఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే పాఠశాల నిర్వహణ చేస్తున్నారు. దీంతో ఉపాధ్యాయుల సమయపాలన, రికార్డులు, మధ్యాహ్న భోజనం నిర్వహణ, పాఠశాలలో నెలకొంటున్న సమస్యలకు పరిష్కారం భారంగా మారింది. పాఠశాల ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు కొన్ని పాఠశాలలో టీచర్లను సర్దుబాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కొందరు పట్టణాలలోంచి రాకపోకలు చేయడంతోపాటు పాఠశాల విధులకు ఎగనామం పెడుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చేయాల్సిన దుస్థితి నెలకొంటుంది. పాఠశాలలకు సంబంధించిన సమస్యలు విన్నవించుకుందామంటే ఎంఈవో ఇన్‌చార్జిగా ఉండడంతో ఆయన ఫోన్ ఎత్తడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా విద్యాభివృద్ధి కోసం రెగ్యులర్ ఎంఈవోని నియమించాలని మండలాల ప్రజలు కోరుతున్నారు.



మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం

పర్యవేక్షణ లేదు



మండలంలో విద్యాభివృద్ధి కుంటుపడుతుంది. రెగ్యులర్ ఎంఈవో లేకపోవడంతో పాఠశాలలపై పర్యవేక్షణ కరువైంది. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. నార్నూర్, గాదిగూడ మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలను నియమించాలి.

– దాదిరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు

కోతకు గురైన రోడ్లు



తోయగూడ వద్ద కోతకు గురైన రోడ్డు



కొలామా వెళ్లే రోడ్డుపై తెగిన వంతెన

నార్నూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీలో జనజీవనం పూర్తిగా స్తంభించింది. గిరి గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గాదిగూడ మండలం కొలామా వెళ్లే రోడ్డు, వంతెనలు, తోయగూడ సమీపంలో రహదారి కోతకు గురయ్యాయి. బైక్‌లు తప్పా మిగతా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రతీరోజు ఆదిలాబాద్ డిపో నుంచి నడిపే కొలామా బస్సును నిలిపివేశారు. ఉట్నూర్ డిపో నుంచి ఉదయం 7 గంటలకు వచ్చే బస్సు రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మారెగాం నుంచి పున్నగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు బురదగా మారింది. పర్సువాడ కునికాసా రోడ్డు వర్షాలకు అధ్వానంగా తయారైంది. కనీసం కాలినడకన వెళ్లలేని పరిస్థితి. అధికారులు రోడ్లు బాగు చేయాలని గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

తెగిన వంతెన వద్ద చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంకోలి సమీపంలో మర్రి వాగు పొంగింది. అంకోలి నుంచి చించుఘాట్ గ్రామానికి వెళ్లే వంతెన అప్రోచ్‌రోడ్ కొట్టుకుపోయింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అప్రమతమైన రూరల్ పోలీసులు రమేశ్, మోహన్ డీఎస్పీ ఆదేశాలతో అక్కడికి చేరుకున్నారు. కోతకు గురైన వంతెన వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి దారిలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత మరమ్మతు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చర్యలు చేపడుతున్న పోలీసులు

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

ఇంద్రవెల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో, ఇంద్రవెల్లి ప్రత్యేకాధికారి సాయన్న అన్నారు. మండలంలోని ముత్నూర్‌లో పారిశుద్ధ్యంను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జెడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో వసతులను పరిశీలించారు. విద్యార్థులపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ముత్నూర్ త్రివేణి సంఘం చెరువు మరమ్మతు పరిశీలించారు. మత్తడి నుంచి బయటకు వెళ్లే వరదనీరు ప్రధాన రహదారిపై రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా హరితమహోత్సవం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏలు మహేందర్, ప్రకాశ్ ఉన్నారు.



చెరువు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

సిరికొండ: రుణమాఫీ అయిన రైతులు బ్యాంక్‌కు వస్తే వారికి వడ్డీ చెల్లించాలని ఇబ్బంది పెట్టొద్దని ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ జాదవ్ నరేశ్‌తో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షుడు షేక్ రంజాన్, నాయకులు ఇమామ్, ప్రవీణ్, దత్తు, రాజేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

జైనథ్: ప్రభుత్వం రుణమాఫీ చేసిన సందర్భంగా మండలంలోని కోర్ట గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం సంబరాలు జరుపుకొన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: రాంపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా బుధవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ నమ్రతా ఓ ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ మండలంలోని ఖుర్షీద్‌నగర్, రణదీవనగర్, సుందరయ్యనగర్, సీలానగర్, గాంధీనగర్, ఇందిరానగర్, డాల్డా కంపెనీ, హరిఓంనగర్, రాంపూర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష బరిలో చరణ్‌గౌడ్

కైలాస్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 5 నుంచి అక్టోబర్ 5 వరకు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష బరిలో సాయి చరణ్‌గౌడ్ నిలిచారు. నిర్ణీత గడువులోగా తన మెజార్టీని సాధించి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యేందుకు మంగళవారం ఆన్‌లైన్ ద్వారా తన నామినేషన్ దాఖలు చేశారు. 35ఏళ్ల లోపు నాయకులు, కార్యకర్తలు ఆన్‌లైన్ ఓటింగ్‌లో ప్రత్యేక యాప్ ద్వారా ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

పశువుల సంచార కట్టడిపై బల్దియా దృష్టి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని రోడ్లపై యథేచ్ఛగా సాగుతున్న పశువుల సంచారాన్ని కట్టడి చేయడంపై బల్దియా యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించింది. పాత జాతీయ రహదారితోపాటు ప్రధాన రోడ్లపై గుంపులు, గుంపులుగా ఉంటున్న పశువులతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిన అధికారులు వాటి నియంత్రణకు చర్యలు చేపట్టారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను మున్సిపల్ కార్యాలయ పాతభవనంలోని ఆవరణకు తరలిస్తున్నారు. యజమానులకు రూ.5వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా విధిస్తున్నారు. మరోసారి రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపేలా వారి నుంచి అండర్ టేకింగ్ లెటర్లను తీసుకుంటున్నారు. పశు యజమానులు తమ మూగజీవాలను రోడ్లపై వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.



బల్దియా పాత కార్యాలయ ఆవరణలో ఉంచిన పశువులను పరిశీలిస్తున్న కమిషనర్

స్నేహితుడికి ఆర్థికసాయం

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన ఓరగంటి రాములు క్యాన్సర్ బారినపడి చికిత్స పొందుతున్నాడు. ఆయనతోపాటు కలిసి చదివిన మిత్రులందరూ కలిసి రూ.7 వేల నగదును రాములకు అందజేశారు. ఆర్‌ఎంపీ ఆధ్వర్యంలో రాములు కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదు అందించారు.



ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

సమస్యలు పరిష్కరిస్తాం

బోథ్: మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీడీవో రమేశ్, ఈవో అంజయ్య తెలిపారు. మంగళవారం ఆ కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడారు. మురుగుకాల్వలు, రోడ్లు నిర్మించాలని కోరారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టాలన్నారు. నాయకులు ఉమేశ్, కాలనీవాసులు ఉన్నారు.

విద్యార్థినులకు వైద్యపరీక్షలు

బోథ్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యుడు నవీన్‌రెడ్డి వారిని పరీక్షించి మందులు అందజేశారు. వైద్యసిబ్బంది కవిత, అనూష, సుమంగళ, స్నేహ, ఆశ, తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899